క్లుప్తంగా

ఎల్లమ్మకు మొక్కులు



మొక్కులు చెల్లించుకున్న గౌడ కులస్తులు

నిర్మల్‌టౌన్: మండలంలోని అక్కాపూర్ శ్రీ రేణుకమాత ఆలయంలో మంగళవారం భక్తులు ఎల్లమ్మతల్లికి ముడుపులు చెల్లించుకున్నారు. నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, జీవన్‌గౌడ్, లింగాగౌడ్, రాజా గౌడ్, రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ'లో ప్రవేశానికి గడువు పెంపు

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశానికి గడువు తేదీ పెంచారని.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న సప్తాహం



కీర్తనలు ఆలపిస్తున్న బృందం సభ్యులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం మంగళవారం ఆరో రోజుకు చేరింది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాత భజన, రాత్రి కీర్తనలు కొనసాగుతున్నాయి. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ ఏర్పాటు

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తీర్చడానికి మంగళవారం ఎస్‌డీఎఫ్ నిధుల కింద ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి బోరుబావి తవ్వించారు. తాగునీటి సమస్యలను వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించగా స్పందించిన ఆయన బోర్‌వెల్ వేయించి మోటారు, పైపుల కొనుగోలుకు నిధులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేకు వీడీసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీవో పర్యటన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఎంపీవో చంద్రశేఖర్ పర్యటించారు. ఈ సందర్భంగా సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామం, నర్సరీలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యదర్శి సాయికుమార్, తదితరులు ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో రోగాలు దూరం

సారంగాపూర్: వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాల బారిన పడకుండా ఉంటామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేదవ్యాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పల్లెదవాఖానా కార్యక్రమాల్లో భాగంగా వైద్యాధికారి పరిశుభ్రత, రుతుస్రావంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్ గౌడ్, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, బాలింతలు, మహిళలు, కిశోరబాలికలు ఉన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న జాన్సన్‌నాయక్

కడెం: మండలంలోని కొండుకూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి తల్లి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం నిర్వహించిన అంత్యక్రియల్లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ పాల్గొన్నారు. అంతకుముందు వారి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

చుక్కలదుప్పి కళేబరం మాయం

నర్సాపూర్(జి): మండలంలోని బామ్ని(బి) శివారు అటవీ ప్రాంతంలో చుక్కల దుప్పి అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు పోస్టుమార్టం నిర్వహించేందుకు మంగళవారం పశువైద్యాధికారి గోవర్ధన్‌ను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఘటన స్థలంలో చుక్కల దుప్పి కళేబరం మాయమైంది. కేవలం ఎముకలు, చర్మం మాత్రమే ఉన్నాయి. దీంతో పోస్టుమార్టం చేయలేదని అధికారులు పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం..

- అసంపూర్తిగా ప్రభుత్వ శాఖల భవనాల నిర్మాణం
- బిల్లులు రాక పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు



ప్రారంభానికి నోచుకోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



అసంపూర్తిగా ఎక్సైజ్ కార్యాలయ భవనం

భైంసాటౌన్: పట్టణంలో పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేకపోవడంతో కొన్ని అరకొర వసతుల నడుమ నెట్టుకొస్తుండగా.. మరికొన్ని శాఖలకు సొంత భవనాలు మంజూరవగా పనులు ప్రారంభించి నిలిపివేశారు. దీంతో ఆయా శాఖలు ఏటా రూ.లక్షల్లో అద్దెలు చెల్లిస్తూ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం బంగారు, వెండి వర్తక సంఘం కొత్త దుకాణ సముదాయం సమీపంలో అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇందుకు నెలకు రూ.7వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. కాగా ఎంపీడీవో కార్యాలయం సమీపంలో కొన్నేళ్ల కిందట సొంత భవనం మంజూరవగా పనులు ప్రారంభించారు. తర్వాత బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. అలాగే ఎక్సైజ్ కార్యాలయం సైతం అద్దె భవనంలో కొనసాగుతుండగా.. ఎంపీడీవో కార్యాలయం సమీపంలోనే సొంత భవనం మంజూరైంది. ఈ భవన నిర్మాణ పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి. ఫలితంగా అద్దె భవనాలకు ఏటా రూ.లక్షల్లో కిరాయి చెల్లించాల్సి వస్తోంది. దీనికితోడు అద్దె భవనాల్లోనూ వసతులు ఉండడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలు అర్ధంతరంగా నిలిపేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

నిధులు లేక నిలిచిపోయాయి

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎంపీడీవో కార్యాలయం సమీపంలో భవనం మంజూరైంది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. కానీ నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు.

– మహేందర్‌రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్, భైంసా

ఇప్పటికైనా సదరు భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే అద్దె భవనాలకు చెల్లిస్తున్న ప్రభుత్వ సొమ్ము ఆదా అయ్యే అవకాశం ముంది.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

పెంబి: ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దశలవారీగా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన పెంబి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే బొజ్జు హాజరై మాట్లాడారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేయించి జైలుకు పంపుతామని హెచ్చరించారు. గ్రామాల్లో కరెంట్ కోతలు లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.

పోడు సాగును అడ్డుకోవద్దు..

పోడు వ్యవసాయం చేస్తున్న రైతులను ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవద్దని ఎమ్మెల్యే బొజ్జు పేర్కొన్నారు. సమావేశం అనంతరం మండలంలోని పుల్గంపాండ్రి, తాటిగూడ, లోతర్యతండా, ఇటిక్యాల, ఇటిక్యాలతండా, పెంబితండా, కోసగుట్ట గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. డీఎఫ్‌వోతో మాట్లాడి గ్రామాలకు కరెంట్, నీటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీటీసీ రామారావు, ఎంపీడీవో రమాకాంత్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీవో రత్నాకర్‌రావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

లైసెన్సు డీలర్ల వద్దే విత్తనాలు కొనండి



సోన్: న్యూబొప్పారంలో అవగాహన సదస్సులో రైతులు



ఖానాపూర్: ఎర్వచింతల్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏఈవో

సోన్: లైసెన్సు కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి వినోద్ అన్నారు. మంగళవారం మండలంలోని న్యూ బొప్పారంలో విత్తనాలు కొనేటప్పుడు రైతులు తెలుసుకోవాల్సిన విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విత్తనాలు కొనేటప్పుడు తీసుకున్న రసీదును దిగుబడి చేతికొచ్చే వరకు భద్రపరచుకోవాలన్నారు. భూమిలో భూసారం పెంచేందుకు జీలుగ విత్తనాలు విత్తుకోవాలన్నారు. 30 కిలోల బ్యాగ్ ధర రూ.1,116 ఉందని.. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో సోన్ డీసీఎంఎస్ కేంద్రానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

రసీదు భద్రపరుచుకోవాలి

ఖానాపూర్: లైసెన్సు కలిగిన డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలను కొనాలని సత్తనపల్లి క్లస్టర్ ఏఈవో రాకేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్వచింతల్, కొలాంగూడ గ్రామాల్లో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తీసుకున్న రసీదుపై విత్తన కంపెనీ పేరు, పంట రకం, బ్యాచ్ నెంబర్, లాట్ నెంబర్, ధర ఉండేలా చూసుకోవాలన్నారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ



కడెంలో పంపిణీ చేస్తున్న ఏడీఏ సుజాత



ఖానాపూర్‌లో బస్తా అందిస్తున్న ఏవో రవి

కడెం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఏడీఏ సుజాత మంగళవారం రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. 30 కిలోల బస్తా ధర రూ.1,116 ఉందని.. ఏఈవోకు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ ఇచ్చి టోకెన్ తీసుకుని సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సంధ్యారాణి, ఏఈవో సురేశ్, సీఈవో రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్ పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం జీలుగ విత్తనాలను ఏవో ఆసం రవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కావాల్సిన వారు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌తో వ్యవసాయ కార్యాలయానికి వచ్చి టోకెన్ తీసుకోవాలని పేర్కొన్నారు. 30 కిలోల బస్తా ధర రూ.1,116 ఉందని.. రెండున్నర ఎకరాల్లో విత్తుకునేందుకు సరిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ఆశన్న, ఏఈవోలు తదితరులు ఉన్నారు.

ఆలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

సారంగాపూర్: మండలంలోని ఆలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏవో రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సులతో సొసైటీ కార్యాలయంలో అప్పగించాలని పేర్కొన్నారు. వర్షాలు కురవక ముందు విత్తనాలు వేస్తే భూమిలో వేడికి కుళ్లిపోయే పరిస్థితి ఉంటుందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ మల్లేశ్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కల్యాణోత్సవంలో భక్తులు

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీ పరిధి చింతల్‌పేట్‌లోని గంగాదేవి ఆలయ ఐదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, మండప పూజలు, అగ్నిప్రతిష్ఠతోపాటు గంగాభవాని–ఈశ్వరుల కల్యాణోత్సవం, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు మహాఅన్నదానం నిర్వహించారు.



ఆలయంలో మూలవిరాట్ విగ్రహాలు

పరామర్శ

ఖానాపూర్: మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు బండారి కిశోర్ దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలిసిన మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం మంగళవారం కోఆప్షన్ సభ్యుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరిమి సురేశ్, ఆడెపు రవి, సతీశ్, రాజేశ్ ఉన్నారు.

క్రమపద్ధతిలో దుకాణాలు ఏర్పాటు చేయాలి



సంతలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని సాయినగర్ అంగడిబజార్‌లో జరిగే వారసంతలో ప్రతీ ఆది, బుధవారాల్లో దుకాణాలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని వార సంత ప్రాంతంలో దుకాణాల ఏర్పాటు ప్రక్రియను పరిశీలించారు. వ్యాపారులు, రైతులు మున్సిపల్ సిబ్బంది కేటాయించిన బాక్సులలో కూర్చుని విక్రయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, సిబ్బంది తిరుపతి, మానాల శంకర్, ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



లింబా(బి)లో పరిశీలిస్తున్న ఏపీఎం అశోక్

కుంటాల: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఏవో సోమలింగారెడ్డి, ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లింబా(బి)లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని.. రైతులు జాగ్రత్తలు పాటించాలని కోరారు. వారి వెంట ఏఈవో శ్రీధర్, సీసీ యూసుఫ్ ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామంలో సత్తన్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్ సందర్శించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు కేంద్రాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. కేంద్రాల నిర్వాహకులు కొనుగోళ్లను వేగవంతం చేసి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ రాజేశ్వర్, రైతులు ఉన్నారు.

హమాలీల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాజ్యం

ఖానాపూర్: తెలంగాణలో హమాలీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం హమాలీల వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సామ్రాజ్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన హమాలీ వర్కర్స్ సమావేశంలో మాట్లాడారు. హమాలీ వృత్తి మీద ఆధారపడి రాష్ట్రంలో సుమారు ఏడు లక్షల మంది వరకు కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం కార్మికులు శ్రమ దోపిడీకి గురికాకుండా తగు చర్యలు తీసుకొని మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా హమాలీ రేట్లను ప్రకటించాలని కోరారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం హమాలీల సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా జె.గంగరాజం, ఉపాధ్యక్షుడిగా కాసారపు రమేశ్, ప్రధాన కార్యదర్శిగా కట్ల వెంకటేశ్, కార్యదర్శిగా చాకలి శ్రీనివాస్, కోశాధికారిగా బొప్పారపు రాజేందర్ ఎన్నికయ్యారు.

బుగ్గిపాలవుతున్న హరితహారం

లక్ష్మణచాంద శివారులో కాలిపోతున్న హరితహారం చెట్లు



రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. గతంలో నాటిన మొక్కల బాధ్యతను పంచాయతీ సిబ్బంది సంరక్షించడంతో ఏపుగా పెరిగాయి. కొన్నిచోట్ల చెట్లుగా మారాయి. కానీ లక్ష్మణచాంద మండలంలో రెండు రోజులుగా కొందరు రైతులు వరి పంట కోసిన తర్వాత కొయలకు నిప్పుపెడుతున్నారు. దీంతో మండలకేంద్రం వచ్చే డబుల్ రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలకు ఈ మంటలు వ్యాపించి పదుల సంఖ్యలో కాలిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులు వరి పొలాల్లో వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా అవగాహన కల్పించాలని మండలప్రజలు కోరుతున్నారు. – లక్ష్మణచాంద



పొట్టపెల్లి సమీపంలో కాలిన మొక్కలు

సీఐటీయూలో చేరిక

ఖానాపూర్: పెంబి మండలంలోని రాంగూడ అంగన్‌వాడీ టీచర్ బట్టి రాణితో పాటు హెల్పర్ హెత్మబాయి మంగళవారం సీఐటీయూ యూనియన్‌లో చేరారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అంగన్‌వాడీల సమస్యలపై సీఐటీయూ రాజీ లేని పోరాటాలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

బడులు ప్రారంభించేలోగా దుస్తులు అందించాలి

కుంటాల: బడులు పునఃప్రారంభమయ్యేలోగా ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందించాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లింబా(కే) గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు యూనిఫాం కుడుతున్న తీరును పరిశీలించారు. వారి వెంట సీసీ కవిత తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. వంగిన చెట్లతో ముప్పు



ఖానాపూర్: ఖానాపూర్ నుంచి నిర్మల్ వెళ్లే ప్రధాన రహదారితోపాటు ఖానాపూర్–పెంబి, ఖానాపూర్–కడెం వెళ్లే మార్గంలో రోడ్లకు ఇరువైపులా చెట్లు ప్రమాదకరంగా మారాయి. చెట్లు పూర్తి వంగి రోడ్లపై పడేలా ఉన్నాయి. గతంలో చెట్లు విరిగిపడి పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రమాదకర చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : మల్లారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ, ఫోన్: 94906 51358